సంకట విమోచని

అమ్మా, కూతురూ ఏం గునకొట్టుకున్నారో నాకు తెలియదు. ఎవరి ప్రోద్భలముందో, ఇంకెవరి ప్రభావాలు పడ్డాయో తెలియదు. నా పెద్దకూతురు మొండికేసింది. తెగేసి చెప్పింది. చిల్లరంగళ్ల మాదిరుండే మన కొత్త ఇంజనీరింగు కాలేజీల్లో దేంట్లోనూ చేరననీ, చెన్నైలో ఏ మంచి ఇంజనీరింగు కాలేజీలోనైనా చేరతాననీ, అదీ కంప్యూటర్స్‌లో మాత్రమే అనీ.

బిడ్డను ఏమీ అనలేకపోయిన అసమర్థత నాది. ఇంటర్‌లో మంచి మార్కులే తెచ్చుకుంది. 'ఎంసెట్‌లో మంచి రాంకును ఎందుకు తెచ్చుకోలేకపోయావని అడగలేకపోయాను. ఇంగ్లీషు ఎం.ఎ., చేద్దామనుకున్న నేను తత్త్వశాస్త్రంలో ఎం.ఎ. చేరిన పాతరోజులు గుర్తుకొచ్చాయి. జీవితంలో పోటీలన్నీ మన చేతుల్లో ఉండవులే అనుకున్నా.

మా పాప కోరినట్లే చెన్నైలో ఒక పేరున్న ఇంజనీరింగు కాలేజీలో చేర్పించాను. కాలేజీ యాజమాన్యం ముఖ్యుడు పెన్సిల్‌తో రాసిన డొనేషను చెల్లించాను. కాలేజీ, హాస్టలు ఫీజులు కట్టాను. పాపను హాస్టల్‌లో చేర్పించి, బాగా చదవమని చెప్పి, తిరుపతికి తిరుగుప్రయాణం కట్టాను.

ఇప్పటికి రెండు లక్షలైంది. నా చదువుకోసం అమ్మిన పొలం పోయింది పోగా, మరొక పదైదు ఎకరాలు అమ్మకంలో పోయాయి.

మా రెండో పాప అయినా వచ్చే ఏడాది ఎంసెట్‌లో మంచి రాంకు తెచ్చుకుంటుందేమో చూడాలి. పై చేయిగా బతకాలనుకున్నప్పుడు, తిప్పలు భరించక తప్పదు. నా కూతురు కంప్యూటర్ ఇంజనీరు కాబోతున్న మొట్టమొదటి ఆడపిల్ల.

మా నాయన ఉంటే ఎంతగా ఆనందపడేవాడో! మా అమ్మ సంతోషంగా పొలాన్ని అమ్మి ఇచ్చింది.

పారిస్ బస్టాండు నా మనసు మాదిరే గజిబిజిగా ఉంది. తమిళమే ఎక్కువగా, బిగ్గరగా వినపడుతున్నా, ఇతర భాషలు చెవికి సోకుతున్నాయి. చేతి సంచులతో, గుడ్డ మూటలతో బీదాబిక్కీ, ముసలీ ముతకా. ఖరీదైన బ్రీఫ్‌కేసులతో, సూట్‌కేసులతో మగవాళ్లూ. మెళ్లో నగలతో స్త్రీలూ, అట్టహాసంగా, సంప్రదాయం, ఆధునికత కలగలిసిన లోకంలా కన్పించింది. చీరెకట్లూ, పంచెకట్లూ, సఫారీలూ, టక్కులూ, పాంట్లూ, స్లాకులూ, నుదిటి మీద పెద్ద పెద్ద కుంకుమ బొట్లూ, నామాలూ, విభూది రేఖలూ, నములుతున్న వక్కాకూ చూసి, పిల్లల చదువులకు చెన్నై భద్రమైన నగరం అనుకున్నాను. బస్సు బయలుదేరింది.

నా పక్క సీట్లోని వ్యక్తిని చూశాను. ఆయన పేపరు చదవడంలో మునిగిపోయి ఉన్నాడు. కిటికీ వైపు సీటు నాది. కిటికీ లోంచి వెనక్కి వెనక్కి పోతున్న నగర వాణిజ్యాన్నీ, పర్యావరణాన్నీ చూస్తూ కూర్చున్నా, బస్సుల్లో ఎవరివో మాటలూ, నవ్వులూ, తినటంలోని కరకరలూ విన్పిస్తున్నాయి. మానసికమైన ఒత్తిడి. శారీరకమైన అలసట. కళ్లు మూసుకున్నా, కుదురుగా సీటుకు చేరబడి...

'కళ్లముందు ఏవేవో కదలాడుతున్న నీడలు; అస్పష్టంగా, స్పష్టంగా, సాకారంగా ప్రత్యక్షమవుతూ కదలిపోతున్న దృశ్య మాలికలు:

మా సింహాద్రిపురం. మా సంత. మా ఇల్లు, మా స్కూలు, మా మంచినీళ్ల బావి. మా ఇంటి వెనుక ఇల్లు. మగ్గం చప్పుడు.

సంతలో మా అబ్బ భుజాలమీద నేను అయిదారేళ్ల పిల్లవాడిగా, బొరుగులు, బెండ్లు, బెత్తాసులు, పాలనురుగులు రాసులు పోసి. అబ్బ నేను చూపించిన వన్నీ కొంటూ, ఒల్లెలో పోసుకుంటున్నాను... పదేళ్ల పిల్లవాడిగా అబ్బ వేలు పట్టుకొని సంతలో లడ్డూ, కారాలు, కజ్జికాయలు కొనమంటున్నాను.

మా అబ్బ అంటున్నాడు:

"బాగా తినాలరా. తిని పెరిగి పెద్దయి మన యాభై ఎకరాల పొలాన్నీ చూసుకోవాలి. మనకు చదువెందుకు? ఈ ఆస్తి చాలదా? ఒకరికి పెట్టవచ్చు. ఇంత తినవచ్చు."

నేనూ, మా నాయన... చుట్టూ ఎవరూ లేరు. నాయన అంటున్నాడు:

"ఒరే' చెన్నా! మీ అబ్బకు నిన్ను చదివించాలని లేదు. నే నొక్కణ్ణే కొడుకును కాబట్టి ఈ ఆస్తేదో నిలిచింది, ఇప్పటిదాకా. పొలంమీద రైతు బతుకూ, గాటిపాట గొడ్డు బతుకూ ఒక్కటే. కాలం ఒక్క మాదిరిగానే ఉండదు. మనకొచ్చే కరువులూ, పైనబడే అవసరాలూ ఎన్నెన్నో? మెట్ట వ్యవసాయం, మట్కా ఒక్కటే. వచ్చేదేమోగానీ పోయేదెక్కువ. బాగా చదువుకో. ఉద్యోగం చెయ్యొచ్చు. ఉండే పొలం ఉండనే ఉంటుంది..."

అమ్మ అన్నం పెడుతోంది. నాకు మాత్రమే విన్పించేటట్లు చెపుతోంది:

"చెన్నయ్యా! ఒక్కగా నొక్క బిడ్డవు. మీ నాయనకు బాగా చదువొచ్చేదంట! ఈ రాజ్జెమేదో పోతాదని మీ అబ్బ ఎచ్చులు. మీ నాయనను అయిదో తరగతిలోనే చదువు చాలించి నాడంట! నువ్వన్నా బాగా చదువుకోవాల... మన చౌడమ్మను చూడు. నీకంటే రెండేండ్లు చిన్నది. నీ తరగతిలో ఉంది. వాళ్ల నాయన మంచిపనివాడే. చేనేత సంగమో అంటూ బయట తిరుగుతాడు, వారానికి రెండుమూడు రోజులు. ఆ యప్ప లేకపోతే నేతపని తల్లి ఎత్తుకుంటుంది. చౌడమ్మ సాయం చేస్తుంది పడుగుకూ, గిడుగుకూ, నేతకూ గీతకూ. తీరిక దొరికితే చాలు. పుస్తకాలు ఎత్తుకుంటుంది. ఇంట్లో నీకేం పనీ చెప్పకపోతిమి. చదువుకోవచ్చు కదా, చౌడమ్మ కంటే బాగా?..."

చౌడమ్మ... చౌడేశ్వరి...

మగ్గం చప్పుడు.

తెల్లటి గుండ్రటి ముఖం, చక్కటి ముక్కు, పెద్ద పెద్ద కళ్లు. చిక్కని నల్లటి జుట్టు. నవ్వు... బుగ్గల మీద లోతైన చారికలు. మాటకారి చౌడేశ్వరి. పదేళ్ల పిల్లగా పావడా, బుట్టల జాకెట్టులో.

పరుగెత్తుతోంది. వెంట నేనే. నేను.

... ...

"చూడబ్బా! ఈ అన్న! చూడు పెదనాయనా! చెన్నారెడ్డెన్నా. చూడు పెద్దమ్మా, అన్న! చీరె నేసేది నేర్పాలంట!" ఒగరుస్తూ అంటోంది.

అబ్బ, నాయన, అమ్మల నవ్వులు. ఆ నవ్వుల్లో జతకలిపిన చౌడేశ్వరి తల్లి నవ్వులు...

చౌడేశ్వరి తల్లి అంటోంది, అబ్బతో:

"మామా! మీవాడు రెడ్డి నేత నేస్తాడేమో!"

అబ్బ అంటున్నాడు:

"చూడమ్మీ. మడక దున్నితే సాలు వంక రుండదు. ఆ రక్తం అమ్మీ! నేత ఒక లెఖ్ఖ కాదు."

చౌడేశ్వరి అంటోంది:

"నువ్వు బాగ చెప్తావు అబ్బా! సేద్యం వేరు, నేత వేరు. నేతలో చక్కదనమే పనితనం. కుంగకుండా ఉండాల. పోగు తెగకూడదు. మిడత కండ్లు రాకుండా చూసుకోవాల!"

"ఓ యబ్బ! నీకంటే బాగా నేస్తాను. ఏమిట్లోనైనా నీతో చౌడక్కా! పోటీనే" అంటున్న నేను...

అబ్బ శవం... నాన్న శవం... వెక్కిళ్ళు పెడతూ ఏడుస్తున్న చౌడేశ్వరి, అందరికంటే ఎక్కువగా...

హెడ్‌మాస్టరు అంటున్నాడు:" ఓరే చెన్నారెడ్డీ చౌడేశ్వరి స్కూలు ఫస్టొచ్చింది. నువ్వూ ఫరవాలేదు. ఫస్ట్ క్లాసొచ్చింది నీకు. పోటీ పడుతూ చదివినావురా...'

'పదహైదేళ్ళ ఓణీ పరికిణీల్లోని చౌడేశ్వరి నవ్వుతోంది.'

ఎవరో బిగ్గరగా నవ్విన చప్పుడు.

మెలకువ వచ్చింది. అటూ ఇటూ చూశాను. నా పక్కన కూర్చున్న ఆయన తమిళంలో ఏదో అడిగాడు. నాకు తమిళం రాదని ఇంగ్లీషులో జవాబిచ్చాను.

"మీరు తెలుగువాళ్లా?" అని తెలుగులో అడిగాడు.

అవునని తల ఊపాను.

"అలసట వల్లనో ఏమో కునుకుతీశారు", అన్నా డాయన. మాటల్లో మర్యాద, నెమ్మదితనం ధ్వనిస్తున్నాయి.

"ఆ" అన్నాను నవ్వుతూ.

ఆయనను పరిశీలనగా చూశాను. అరవైయేళ్లు పైబడి ఉంటాయి. హుందాగా ఉన్నారు. పొడగరి. కళ్లజోడులో పొడవైన ముఖం. పొడవు ముక్కు. చెవులు పెద్దవే. ఎగుభుజాలున్నాయి.

"ఏం అట్లా చూస్తున్నారు? నేను అచ్చమైన తెలుగువాణ్ణే. అయితే రాష్ట్రేతరాంధ్రుని. మరొకలా చెప్పాలంటే విదేశాంధ్రుడిని కూడా. అన్నట్లు తిరుపతికేనా?" అని అడిగాడు.

"అవున"న్నాను.

"తిరుపతిలో ఏం చేస్తారు?"

"వెంకటేశ్వర యూనివర్సిటీలో రీడర్ని", నిన్న మొన్నవచ్చిన కెరియర్ అడ్వాన్స్ మెంటు అయితేనేం అనుకుంటూ జవాబిచ్చాను.

"ఏ డిపార్ట్‌మెంట్?"

"ఫిలాసఫీ"

"డాక్టరేటు ఏ విషయం మీద చేశారు?"

పిహెచ్.డి. టైటిల్ చెప్పాను. ఇంగ్లీషులో. ఆయన స్వచ్ఛమైన తెలుగు అనువాదం చేస్తూ అన్నాడు:

"మహాభారతంలో సంక్షేమ రాజ్యభావన... సంస్కృత భారతం ఆధారంగా పరిశోధన సాగిందా? తెలుగు భారతం ఆధారంగానా?"

నాకు సంస్కృతం రాదని చెప్పడానికి మనసు అంగీకరించలేదు. పెద్దవాడు, ఆయనకు సాధ్యమైనంత నిజాయితీతో బదులు చెప్పాలనిపించింది:

"నేను, ఇంగ్లీషు, తెలుగు అనువాదాల మీదా ముఖ్యంగా ఆధారపడినా, భారతం మీద ఇంగ్లీషులో తెలుగులో వచ్చిన విమర్శలూ, వ్యాఖ్యానాలూ చదివినా. అవసరమైనచోట్ల సంస్కృత శ్లోకాల్ని ఉదహరించాల్సి వచ్చినప్పుడు సంస్కృతం

శాఖలోని నా మిత్రుడు సాయపడ్డాడు." అన్నాను, తెలుగులోనే మాట్లాడడానికి ప్రయత్నిస్తూ.

"మంచి తెలుగు మాట్లాడుతున్నావు. తమిళుల్లాగా మనకు భాషాభిమానం ఉండాలి. మరీ పూర్తిగా, చాదస్తంగా కాదనుకో," అన్నాడు మెచ్చుకోలుగా.

ఆయన స్వగతంగా చెప్పకపోయాడు:

"మహాభారత కాలాన్ని ఖచ్చితంగా చెప్పలేం. మన చరిత్రతో వచ్చిన చిక్కే అది. భారతంలోని భాషనూ, ఇతర లోపలి సాక్ష్యాలనూ పరిశీలిద్దామా అంటే అవి క్రీస్తుపూర్వం నాల్గవ శతాబ్ది నుండి పదహైదు పదహారు శతాబ్దాలదాకా ఉంటాయి. ఎన్నో ప్రక్షిప్తాలు.

అష్టౌశ్లోక సహస్రాణి అష్టౌశ్లోక శతానిచ
అహమ్ వేద్మి శుకోవేత్తి సంజయోవేత్తి వా నవా"

మరి ఎనిమిదివేల ఎనిమిది వందల మూల జయ భారతం సపాద లక్ష గ్రంథమైంది. పాఠాంతరాలతో ఇప్పుడు మరి నాలుగింతలైంది..."

ఆయన జ్ఞాపకశక్తికి విస్తుపోయాను. ఆయన మాటలకు అడ్డు తగల వద్దనుకున్నాను. పరిశోధనలో మునిగిననాళ్ల ఉత్సాహం నాకు తిరిగి వచ్చింది.

ఆయన తిరిగి చెప్పడం మొదలు పెట్టాడు:

"భారతం మీద లెఖ్ఖలేనన్ని ప్రభావాలు. ఉపాఖ్యానాలు పోనీ... నేననేది రాజనీతి, లోకనీతి విషయాల్లో... సంక్షేమం అంటే గుర్తుకొస్తోంది. సభాపర్వంలో ధర్మరాజుకు నారదుడు చేసిన రాజధర్మోపదేశం. 'పంట చెరువులన్నీ వర్షం నీళ్లతో నిండి కర్షకులకు ఆనందం కల్గిస్తున్నాయా? పేదరైతులకూ, వణిజులకూ అప్పురూపంలో విత్తనాలు దొరుకుతున్నాయా?' అని నారదుడు అడగటం గుర్తుకొస్తోంది. ఇలా మన ప్రభుత్వాల్ని అడిగే వాళ్లున్నారనుకుందాం. 'అడిగే వానలు రాలేదు. టెర్మినేటరు విత్తనాలు కొనబోతున్నాం. దొరికిన మేరకు ప్రపంచ బ్యాంకు నుంచి అప్పులు తెస్తున్నాం. విత్తన ఋణాలు ఏర్పాటు చేస్తున్నాం' అంటారేమో ఇప్పటి మన సంక్షేమ రాజ్య ధర్మరాజులు!"

ఆయనలోని హాస్యానికి నాకు నవ్వు వచ్చింది. నా నవ్వుతో ఆయన జతకలిపాడు.

"నాకొక అనుమానం ఉందయ్యా! దీఘ నికాయంలో, మహావాస్తులో... మిళింద పన్హలో రకరకాల వృత్తుల ప్రస్తావన ఉంది. సంగం వాఙ్మయాన్ని కూడా ఈ దృష్టితో చూడాల్సిందే. అర్ధశాస్త్రంలో నేత పరిశ్రమను గురించి ఉంది. చూసే ఉంటావు. 'నేర్పు గల వాళ్లతో సభాధ్యక్షుడు నేయించాలట! వడికించటం, నేయించటం స్త్రీలతోనే చేయించాలట. నూలు రకాన్ని బట్టి, చాకిరినీ బట్టి, జీతాలు ఏర్పరచాలట. సూత్రం తగ్గితే, ధర గట్టి, కోత విధించాలట!' ఆ స్త్రీలకు రాజు, ముఖ్య పురోహితుడికీ, సలహాదారుకూ ఇచ్చినట్లు దగ్గర దగ్గర సాలుకు యాభైవేల

పణాలిచ్చేవారంటావా? దొంగలు! ఆ స్త్రీలకు అరవై పణాల కనీస వేతనం కూడా ఉండేదని నేను నమ్మను. ఇదేమి సంక్షేమ భావన? స్త్రీ వాదులు ఈ దృష్టినుంచీ పరిశీలిస్తే బాగుండు. అన్ని సంక్షేమాల వైభోగాలు బయటపడతాయి."

ఆయన మాటల్లోని కరుకుదనం చూసి అదిరిపడ్డాను. ఆ ప్రశ్నలు, ఆ వివరణలు, ఆ వ్యాఖ్యలు, హాస్యం, కరుకుదనం, ఆ మర్యాద, వీటిని గురించి ఆలోచిస్తూ ఉంటే ఆమధ్య ఒక ప్రఖ్యాత ఇంగ్లీషు దినపత్రికలో ఆయన ఫోటో, ఆయన పరిచయ వ్యాసం నా స్మృతిని వెలిగించాయి.

"మీరు... మీరు... ప్రొఫెసర్ నాగరాజు, ప్రొఫెసర్ నాగరాజన్..."

"నన్ను ఎలా గుర్తించారు?" చిరునవ్వుతో కుతూహలంగా అడిగాడు.

"నా లెక్చరర్ ఇంటర్వ్యూ అప్పుడు మీరొక ఎక్స్‌పర్ట్‌గా వచ్చినారు. పదిహేడేండ్లయింది. ఇంతవరకూ గుర్తుపట్టలేక పోయాను. క్షమించండి" అన్నాను.

"నువ్వే మేలు బాబూ. గుర్తు పట్టావు. నేను నిన్ను గుర్తుపట్టలేదు. మీ పేరు?" ఆయన అడిగారు.

పేరు చెప్పాను.

"పదేళ్లు యు.కె.లో, జర్మనీలో గడిపాను. నా భార్య పోవటంతో మన గూడు చేరుకున్నాను. ఒక సంవత్సరమైంది వచ్చి. తిరుపతిలో రెండు మూడు రోజులుందామని వస్తున్నా. మీ యూనివర్సిటీలో ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్‌లోని డాక్టరు చౌడేశ్వరి తెలిసే ఉంటుంది. చౌడేశ్వరి భర్త నా రక్తబంధువు. నాకు చౌడేశ్వరి అంటేనే ఎక్కువ ఆపేక్ష... ఏదేదో మాట్లాడాను. పెద్దవాణ్ణి. మీరు తత్త్వశాస్త్రం అనటంతో నా నాలుకకూ హద్దూ పద్దూ లేకపోయింది. ఏమీ అనుకోకు. నిన్ను విసిగించి ఉంటాను..."

తొడలమీద అందాకా పెట్టుకున్న పుస్తకం తీసి చదవటంలో డాక్టర్ నాగరాజన్ లీనమయ్యారు. ఆయన్ని మాట్లాడించే ధైర్యం లేకపోయింది. ఆయన చౌడేశ్వరితో తన బంధుత్వాన్ని గురించి చెప్పారు.

చౌడేశ్వరిని గురించిన ఆలోచనలు నన్ను కమ్ముకున్నాయి–కిటికీలోంచీ చూసే దృశ్యాల మధ్య.

నేను లెక్చరర్‌గా సెలక్ట్ అయిన విషయం, ఆర్డర్ రాకముందే చౌడేశ్వరి నాకు చెప్పి, అభినందించిన రోజు గుర్తుకొచ్చింది.

"నీకెట్లా తెలుసు? నిజంగానా?" అని చౌడేశ్వరిని అడిగాను–సంతోషంతో, అనుమానంతో.

"ఎట్లాగో తెలిసింది... నువ్వు సెలక్ట్ అయినావు," అంది చౌడేశ్వరి.

ఇప్పుడనిపిస్తోంది. ప్రొఫెసర్ నాగరాజు చెప్పి ఉంటాడని.

అప్పుడే ఆరోజు చౌడేశ్వరిని నేను అడిగాను:

"నీ సెలెక్షన్ ఏమైంది?" అని.

"తెలియదు. తప్పకుండా సెలెక్ట్ అవుతాననే ఆత్మవిశ్వాసం నాకుంది. నాకున్న అర్హతలు ఇతర అభ్యర్థులకు ఉంటాయనుకోను. స్వంతంగా పరిశోధన వ్యాసాల్ని విదేశీ జర్నల్స్‌లో కూడా ప్రచురించిన దాన్ని. ఇంటర్వ్యూ చాలా బాగా చేసినా," అంది చౌడేశ్వరి ధీమాతో.

అదే, ఆ ధీమా... పొగరేమో అన్పించింది. ఆ పొగరుతోనే నాకు కష్టం.

ఒకేరోజు ఇద్దరం ఎవరి డిపార్ట్‌మెంటుల్లో వాళ్లం చేరాం. కానీ చౌడేశ్వరి నాకంటే నాలుగేండ్లు ముందు రీడరైంది. రిజర్వుడు పోస్టు. రీడరైంది. రేపో మాపో ప్రొఫెసరు కాబోతోంది. నేను ప్రొఫెసరు కాగలననే నమ్మకం నాకు పోయింది. మా డిపార్ట్‌మెంట్ రాజకీయాలట్లాంటివి. చౌడేశ్వరి పట్ల ఏదో అసూయ! ఏదో కసి! ఏదో కోపం! వేరు కులాలమీద, రిజర్వేషన్ల మీద నాలో నాకే తెలియని వ్యతిరేకత.

రెండేళ్ల కిందట టీచర్స్ అసోసియేషన్ ఎన్నికల్లో మా పానెల్ అభ్యర్థిగా ఉండమని చౌడేశ్వరిని అడిగాము. ఖరాఖండిగా చెప్పిన చౌడేశ్వరి మాటల్ని నేనింకా మరిచిపోలేదు:

"నేను బి.సి.ల్లో ఒక కులానికి చెందిన దాన్నే. కాదనను. దానికి నేను కారణం కాదు. ఈ కారణంగా మీ కుల కోటా రాజకీయాల ఎన్నికల్లో తలదూర్చలేను" అంది.

నేను కోపం దిగమింగుకున్నాను. మా గుంపు మాత్రం నన్ను బాగా తిట్టింది. చౌడేశ్వరిని అప్పటినుంచి పలకరించటం మానేశాను. పుండు మీద కారం చల్లితే ఎట్లా?

తిరుపతి ఆర్టీసీ బస్టాండులో ప్రొఫెసర్ నాగరాజూ, నేనూ బస్సునుంచి దిగాము. ఎదురుగా చౌడేశ్వరి. ఆశ్చర్యం! ఆందోళన! బలవంతపు నవ్వు నవ్వాను. ప్రొఫెసర్ నాగరాజు ప్రయాణ సంచీని చౌడేశ్వరి అందుకుంది. "ముగ్గురం కలిసి పోదాం" అంది, నా వైపు చూస్తూ. నేను ముఖం తిప్పుకోలేకపోయాను. మౌనంగా వాళ్లిద్దరి వెంట నడిచాను. ఆటోను పిలవబోయాను. "కారుంది" అంది చౌడేశ్వరి. అద్దెకారు తెచ్చింది అనుకున్నాను.

నీలం రంగులో తళ తళ మెరిసే కారుముందు చౌడేశ్వరి ఆగింది. అది శాంత్రో! వెనుక వైపు ఎడమ తలుపు తీసింది. ఆశ్చర్యం నుంచీ తేరుకోకముందే ప్రొఫెసర్ నాగరాజు అన్నాడు: "రావయ్యా. కూచో, నేను కుడివైపు జరుగుతాలే. రా"

చౌడేశ్వరి కారు తోలటం మొదలుపెట్టింది - తిరుపతి సంస్కృతీ సందోహం మధ్య. ప్రొఫెసర్ నాగరాజు అన్నాడు:

"చెన్నారెడ్డి తోడు మా ప్రయణంలో హాయిగా ఉంది. నాది కొంత చాదస్తమే అనుకో. ఒకటే శాఖ వాళ్లం అని తెలిశాక ఏదేదో మాట్లాడాను; బస్సులో. అది కాలక్షేపమో, మనసులో ఉన్నది పంచుకోవటమో నాకు తెలియదు. ఇతను విన్నాడు. నేను ఆలోచించాను. నిజానికి కొత్త ఆలోచనలు వచ్చాయి. చెన్నారెడ్డి మూలంగా.

అన్నట్లు చౌడేశ్వరీ! మీ పాపకు ఐ.ఐ.టి. కాంపస్ నచ్చిందట! ఆ చెట్లూ, ఆ వాతావరణం బాగా నచ్చాయట! క్లాసులు మొదలయ్యాయట! అక్కడ ఎవరి పని వాళ్లదేనట! ఎవరి గాంభీర్యం వాళ్లదేనట! చదువు... బోధన... చదువు... వచ్చేముందు ఫోన్లో మాట్లాడా. నీ కూతురు ఉత్సాహం చూసి పరమానంద పడ్డాననుకో, జర్మనీలో ఆనందపడినట్లు. పిల్లలకు వాళ్ల చదువుకూ, జ్ఞానానికీ అవసరమైన శక్తినిచ్చే సంస్థలు ఇంకా మిగిలి ఉన్నాయి, ఈ దేశంలో..."

చౌడేశ్వరి ఏమనుకుందో ఏమో నాకు తెలియదు. కారు నడుపుతూ వెనక్కి చూడకుండా నన్ను అడిగింది:

"మీ పాపకూడా చెన్నైలో అదేదో మంచి ఇంజనీరింగ్ కాలేజీలో, కంప్యూటర్స్ లోనే చేరిందని, మా పాప గంటకిందట ఫోను చేసినప్పుడు చెప్పింది. కష్టమో, నిష్టురమో మంచిపని చేసినావు! మీ పాపా, మా పాపా మంచి స్నేహితులు, నీకు పూర్తిగా తెలియదేమో గానీ!"

ఇప్పుడు తెలుస్తోంది. నా భార్యా, నా కూతురూ గునకొట్టుకోవడం వెనుక అసలు కారణం తెలుస్తోంది. చౌడేశ్వరి కూతురు ఐ.ఐ.టి.లో, నా కూతురు ఒక ప్రైవేటు కాలేజీలో. ఈర్ష్య తన్నుకొచ్చింది. మాట్లాడలేకపోయాను. ఏదో తపన! ఏదో బాధ? ఇదీ రిజర్వేషన్ల కారణంగానేనా?

"ముందుగా క్వార్టర్‌కు పోదాం, టీ తాగుదాం. నిన్ను మీ ఇంటి దగ్గర దింపుతాను." అంది చౌడేశ్వరి నన్ను ఉద్దేశిస్తూ.

"చాలా అలసటగా ఉంది. మరోమారు మీ ఇంటికి వస్తాను. పద్మావతి ఉమెన్స్ కాలేజీ రోడ్డు మోటున దిగుతాను. అక్కడినుంచి మా ఇల్లు దగ్గరే" అన్నాను.

"నువ్వు ఇల్లు మారినావంట. మా పాప చెప్పింది. ఇల్లు చూసినట్లుంటుంది" అంది చౌడేశ్వరి.

మా ఇంటి దగ్గరకే చౌడేశ్వరి కారును పోనిచ్చింది. దిగి ఇద్దరినీ ఇంట్లోకి ఆహ్వానించాను.

ప్రొఫెసర్ నాగరాజు "రేపో మాపో వస్తానులే. ఉంటాను కదా!" అన్నాడు.

"ఒక్క నిముషం మామయ్యా" అంటూ చౌడేశ్వరి కారు దిగింది. నాతోపాటు మా ఇంట్లోకి వచ్చింది. మా ఆవిడను పలకరించింది. "మళ్లా కలుద్దాం" అని చెప్పి, కారెక్కింది.

మా ఆవిడ తబ్బిబ్బు అయినట్లుంది. చాటంత ముకం చేసుకొని అంది: "కొత్తకారు. చాలా బాగుంది. ఈ మధ్యనే కొనిందనుకుంటా. చౌడేశ్వరి అదృష్టవంతురాలు, పైగా మంచి మనిషి."

అదృష్టానికీ మంచితనానికీ మధ్య ఉండే లంకె ఏమిటో అర్థం కాలేదు. లోలోపలి మంటను బలవంతంగా అణచుకున్నాను. 'ఇద్దరి సంపాదనా ఉంటే నేను కారును ఎప్పుడో కొనేవాణ్ణి' అని మా ఆవిడతో అని ఉండేవాణ్ణే. ఆ తర్వాత ఆవిడ

విసుర్లు వినాలి. స్నానానికి బయలుదేరాను. స్నానం చేస్తున్నంతసేపూ నా డొక్కు స్కూటరు జ్ఞాపకాలూ, చౌడేశ్వరి మీద మరింత ఈర్ష్యా.

రెండురోజుల తర్వాత చెప్పాపెట్టకుండా ప్రొఫెసరు నాగరాజును తీసుకొని చౌడేశ్వరి నా గదికి వచ్చింది.

"మామయ్య మీ డిపార్ట్‌మెంటునూ, నిన్నూ చూడాలన్నారు... నాకు క్లాసుంది. పండ్రెండూ పదిహేను కల్లా తిరిగి వస్తాను, మామయ్యను ఇంటికి తీసుకపోవడానికి", అని చౌడేశ్వరి వెళ్లిపోయింది.

డిపార్ట్‌మెంటులోని హెడ్‌కూ, ప్రొఫెసర్లకూ, లెక్చరర్లకూ పరిచయం చేద్దామనిపించింది. ఆ విషయమే ప్రొఫెసర్ నాగరాజును అడిగాను. ఆయన ఉత్సాహం చూపలేదు - "నాకు తెలిసిన వాళ్లంతా రిటైరైపోయార"ని చెప్పి. టీ తెప్పించాను. టీ తాగుతూ "మీ థీసిస్ అచ్చు అయిందా?" అని అడిగాడు.

"కాలేదు" అన్నాను.

"ఎందుకు?" అన్నారు ఆయన.

"ఆసక్తి లేక" అన్నాను.

"పరిశోధన మీదనా? జీవితం మీదనా?"

నేను ఆ ప్రశ్నకు బదులు చెప్పలేకపోయాను.

"థీసిస్ కాపీ ఉంటే ఇవ్వండి. చదివి ఇస్తాను" అని ఆయన అడిగారు.

నా వెనుక టేబులు మీద చెల్లాచెదురుగా పడి ఉన్న కాగితాలూ, పుస్తకాల మధ్య నా పరిశోధనా గ్రంథాన్ని సిగ్గుపడుతూ ఆయన చేతులకు అందించాను. అంతలో నా పర్యవేక్షణలో ఎం.ఫిల్; పిహెచ్.డి. లు చేస్తున్న ఒక అబ్బాయీ, ఒక అమ్మాయీ వచ్చారు. ప్రొఫెసర్ నాగరాజును వాళ్లకు పరిచయం చేశాను. వాళ్లకు, ఆయన తత్త్వశాస్త్ర విషయాలను, అడిగిన వాటికన్నిటికీ సమాధానాలు చెప్పారు. యు.కె., జర్మనీ విశ్వవిద్యాలయాల్లో తత్త్వశాస్త్రంలో జరుగుతున్న చర్చలనూ పరిశోధనలనూ వివరించారు.

సరిగా పండ్రెండూ పదిహేనుకు చౌడేశ్వరి వచ్చింది.

నేను ప్రొఫెసర్ నాగరాజును ఆ రాత్రి భోజనానికి రమ్మని ఆహ్వానించాను. చౌడేశ్వరిని కూడా.

"భోజనం చేసి కొండకు వెళ్లి, రేపు ఉదయం చెన్నై వెళుతున్నా, ఎల్లుండి మద్రాసు యూనివర్సిటీలో ఒక లెక్చరుంది. తప్పక వెళ్లాలి", అన్నారు లేచి నుంచొని చౌడేశ్వరి వెంట వెళ్లడానికి సిద్ధపడుతూ, నా థీసిస్‌ను పట్టుకొని. దాన్ని నాకు చూపిస్తూ అన్నారు. "మీకు వెళ్లేలోగా అందచేస్తా"నని.

ఆ. మరుసటి రోజుకాక మరుసటి రోజు పదకొండు గంటల ప్రాంతంలో చౌడేశ్వరి నా గదికి వచ్చింది.

"నిన్ననే మీ ఇంటికి వస్తామనుకున్నా. కుదరలేదు. థీసిస్ భద్రంగా, స్వయంగా నీకే అందచెయ్యమని మామయ్య చెప్పి చెన్నై పోయినారు", అంది చౌడేశ్వరి నవ్వుతూ, నా థీసిస్ నా టేబులు మీద ఉంచి. దాన్ని తీసి నా వెనుక టేబుల్ మీద పడేశాను.

"మామయ్య నీ థీసిస్‌ను రాత్రే పూర్తిగా చదివారంట! 'మంచి కృషి' అని మెచ్చుకున్నారు. చెన్నైకి వస్తే నిన్ను తన ఇంటిలోనే దిగమన్నారు. ఉత్తరం రాస్తారంట!" అంది చౌడేశ్వరి.

"మా రిసెర్చ్ స్టూడెంట్లు, ఆయన తమతో మాట్లాడినందుకు పొంగిపోయినారు. దర్పం లేని మనిషి," అన్నాను.

"అన్నా!"

చౌడేశ్వరి పిలుపుకు నేను చకితుణ్ణయ్యాను. చౌడేశ్వరి ముఖంలోకి నేరుగా చూడగలిగాను.

ఆమె అంది, పరమ శాంతంగా:

"ఇద్దరం ఒకే ఊరి వాళ్లం. ఒకచోట పెరిగినాము. ఒకే స్కూల్లో చదువుకున్నాము. ఆ రోజులు ఎప్పుడైనా నీకు గుర్తుకు రావా?"

"వస్తుంటాయి" అన్నాను.

"ఈ మధ్య రెండేండ్లనుంచీ నాతో ముభావంగా ఉంటున్నావు. కోపమేదో వచ్చినట్లుంది. నీకింకా కోపం వచ్చినా ఫరవాలేదు. నా మనుసులో మాట చెప్పాలని ఉంది" అంది చౌడేశ్వరి.

ఏం చెబుతుందో కానీ అనుకుంటూ టేబుల్ మీద కాగితాలను సర్దసాగాను.

"జీవితాన్ని సాధించే వాళ్లూ, జీవితంలో సాధించుకునే వాళ్లూ అని రెండు రకాల మనుషులున్నారు. నువ్వు మొదటి రకం మనిషివి అన్నా!"

చౌడేశ్వరి మాటలతో ఉలిక్కిపడ్డాను.

"ఎట్లా?" అని ఆందోళనతో అడిగాను.

"నీ మీద నీ ఆస్తి బరువుంది" అంది చౌడేశ్వరి.

"ఆస్తి ఏం చేసింది?" అన్నాను తమాయించుకొని.

"ఒక ఎకరం మీద పెట్టే పెట్టుబడికీ, శ్రమకూ, ఆదాయానికీ; అట్లాగే ఒక చీర నేతలో పెట్టే పెట్టుబడికీ, శ్రమకూ, ఆదాయానికీ మధ్య తేడాలు నీ కెప్పుడన్నా కన్పించినాయా? నువ్వు యాభై ఎకరాల కుటుంబం నుంచి వచ్చిన వాడివి."

"ఇప్పుడా ఆస్తి కరిగిపోతోంది. ఇద్దరు ఆడపిల్లల చదువులున్నాయి. వాళ్ల పెళ్లిళ్లున్నాయి" అని గొణిగాను.

"అదే చిక్కు" అంది చౌడేశ్వరి.

ఆ ముక్క నాకు అర్థం కాలేదు.

"చూడన్నా! మీ ఇంటి వెనుక మీరు బాడుగ లేకుండా ఇచ్చిన ఇంట్లో చీరెల పోగుల్ని చక్కదిద్దిన చౌడేశ్వరినే నేను, చీరెలు నేసిన చౌడేశ్వరినే నేను. మీ ప్రేమలు దొరికినాయి. అంతో ఇంతో ఆదరణ దొరికింది. ఆస్తూలూ. కులం దొరకలేదుకదా? నా అభద్రతే నా మీద ఒత్తిడి. దాన్ని పోగొట్టుకోవడమే నా ఘర్షణ. ఇది నేను సాధించుకున్న జీవితం. ఎవరో అప్పనంగా ఇచ్చింది కాదు.

మా నాయన సంగతి నీకు తెలుసు. తను నమ్మిన రాజకీయాలు, చేనేత సంఘం ఐక్యత దెబ్బతిన్నాయి. కుంగిపోయినాడు. వెనకడగు వెయ్యలేదు. చీరెలు నేసీ, కొనీ, మోసీ ఊరూరూ తిరిగీ, అమ్మీ నన్ను చదివించినాడు. వేణ్ణీళ్లకు చన్నీళ్లు తోడుగా ఏదో ఒక స్కాలర్‌షిప్ వస్తూనే ఉండేది. నాయన యాభైల నాటి సంగతి చెప్పేవాడు, ప్రొద్దుటూర్లో వీధిన పడిన చేనేత కుటుంబాలను గురించి. తర్వాత తర్వాత ఆయా జిల్లాల నుంచి భివండీకీ, కోయంబత్తూరుకూ పోయిన వలసల గురించి, బతుకుతెరువు కోసం పడిన అష్టకష్టాల గురించి..." చౌడేశ్వరి కంట తడిని చేతిగుడ్డతో తుడుచుకోవడం చూసి నా మనసు తల్లడిల్లింది. నిరుత్తరుణ్ణి అయ్యాను.

"అన్నా! నేను నీకంటే రీడరుగా ముందు అయినా, నా మీద కోపానికి అదే కారణం అనుకోమంటావా? కులంవల్లా, ఆ కులానికుండే రిజర్వేషన్ వల్లా మాత్రమే ఆ అయ్యే రీడరేదో అయ్యానని కోపమా?"

చౌడేశ్వరీ సూటి ప్రశ్నకు సూటిగా చెప్పగలిగిన శక్తి సన్నగిల్లింది.

"నా అర్హతలు నీకు తెలియవనుకోవాలా?" చౌడేశ్వరి అడిగింది.

"తెలుసు" అన్నాను, నీరసంగా.

చౌడేశ్వరి నా వెనుక టేబుల్ మీది మంచినీళ్ల సీసా తీసుకుంది. గ్లాసులో ఒంపుకుంది. నెమ్మదిగా తాగుతోంది.

చౌడేశ్వరి పదో తరగతి స్కూలు ఫస్టు. ఇంటర్, బి.ఎ.లో ఫస్ట్ క్లాసులు. ఎం.ఎ.లో యూనివర్సిటీ సెకండ్. పి.హెచ్‌డి. గొప్పదని విదేశీ పరీక్షకుల సిఫారసు. పరిశోధన పత్రాలు ప్రముఖ జాతీయ అంతర్జాతీయ పత్రికల్లో వచ్చాయి. టీచరుగా మంచి పేరుంది. ఇవన్నీ నాకు తెలుసు.

"పోనీ. నాకు ఏవో పెద్ద అర్హతలు లేవే అనుకుందాం. కావలసిన కనీసార్హతలు మాత్రమే ఉన్నాయనుకుందాం? తప్పా? అట్లాగే రేపోమాపో అట్లాంటి కనీసార్హతలున్న నా కులం కంటే కింది కులం మనిషికి నా కంటే ముందుగా ఏ పై పదవో వచ్చిందనుకున్నాం. ఈర్ష్య పడడం ఎందుకు? చరిత్రలో జరిగిన, జరిగే తప్పులన్నీ పోయేవరకు ఇవి తప్పవు" అంది చౌడేశ్వరి.

'అవునేమో' అన్నాను సందిగ్ధంగా.

చౌడేశ్వరి నింపాదిగా అంది:

"అన్నా! నువ్వు మంచి టీచరు వనీ, మంచి గైడువు అనీ అందరూ అంటారు. నీకు ఎవరిమీద కోపం? ఎందుకు? రిసర్చి పేపర్లు రాయటం మానేసినావు అని

విన్నా... ఆఫీసర్ల క్లబ్బుకు పోవడం మానుకోలేవా? ఎందుకు నిన్ను నీవు హింసించుకుంటావు?"

చౌడేశ్వరి పొడవవలసిన చోట పొడిచింది. బాల్యంలో గోలీలాడేటప్పుడూ, అల్లరి స్నేహితులతో తిరిగినప్పుడూ, ఎం.ఏ., చదువుకునే రోజుల్లో సిగరెట్లు తాగుతున్నది చూసినప్పుడూ చౌడేశ్వరి మందలింపులు స్మృతికి వస్తున్నాయి. నా అలవాట్లను తెలుసుకొనే, క్లబ్బు ప్రస్తావన తెచ్చిందని అర్థమైంది. చౌడేశ్వరి నిష్కాపట్యం, ఆపేక్ష ముందు నోరెత్తలేకపోయాను.

"రేపు ఆదివారం. నువ్వూ, వదినా, చిన్న పాపా మా ఇంటికి భోజనానికి రావాల. అన్నట్లు అసలు విషయం మరిచినా, నీ థీసిస్‌ను ప్రచురించే ఏర్పాటు చేస్తాననీ, అదనంగా చేర్చాల్సిన విషయముంటే సూచిస్తాననీ నాగరాజు మామయ్య నీకు చెప్పమన్నాడు... ఇంటికి రేపు అందరూ తప్పక రావాల, నీ మనసును నొప్పించి ఉంటే క్షమించు. చిన్నప్పుడు 'నొప్పి నొప్పో' అని మొత్తుకుంటున్నా నా జడ లాగేవాడివి. గుర్తు తెచ్చుకో... వస్తాను."

నా గదిలోంచీ బయటకు వెళ్తున్న చౌడేశ్వరి ఎంతో ఉన్నతంగా కన్పించింది.

నా పిల్లలైనా జీవితాన్ని సాధిస్తూ కూర్చోకుండా, జీవితంలో చౌడేశ్వరిలాగా ఏదైనా చక్కగా సాధిస్తే బాగుండు.

నాలో కూడా ఏదో చలనం కొత్తగా మొదలైంది.

● ఆంధ్రప్రభ ఆదిత్య హృదయం, ఆదివారం
6 ఏప్రిల్ - 13 ఏప్రిల్ 2003. ●